సాక్షి అనకాపల్లి

మంగళవారం । 24 । జనవరి । 2023



పోర్టులో పుష్ప

కొమ్మాది: పుష్ప–2 సినిమా సన్నివేశాలను షిప్‌యార్డ్, పోర్టు ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. సినీ హీరో అల్లు అర్జున్ పాల్గొన్నారు.



వాసవీ మాతకు విశేష నివేదన

విశాఖ: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో 102 ప్రసాదాలను నివేదించారు.

కౌలాలంపూర్‌కు కొత్త విమానం



గోపాలపట్నం: విశాఖ నుంచి కౌలాలంపూర్‌కు విమాన సర్వీసు మార్చిలో ప్రారంభం కానుంది. బాటిక్ సంస్థ నడపనున్న ఈ సర్వీస్ షెడ్యూల్ రెండు రోజుల్లో విడుదల కానుంది.

న్యూస్‌రీల్

ప్లాస్టిక్ బ్యానర్లపై నిషేధం

- గణతంత్ర దినోత్సవం నుంచి అమలు

తుమ్మపాల: ఈ నెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవం నుంచి ప్లాస్టిక్ బ్యానర్లను ప్రభుత్వం నిషేధిస్తున్నట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వ నిబంధనలను దృష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ బ్యానర్లు ముద్రించకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. శాఖలకు అప్పగించిన పనులను పక్కాగా పూర్తి చేయాలన్నారు. ఆయా శాఖల పథకాలను శకటాలు, స్టాళ్ల ద్వారా ప్రజలందరికి తెలిసేలా అలంకరించాలన్నారు. సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీర్వో వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నేడు

తుమ్మపాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 24న రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యెకోహోమా కంపెనీలో 150 ఉద్యోగాలకు అర్హులైన మహిళా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. డిప్లమా, బీఎస్సీ పూర్తి చేసి కనీసం 5.3 అడుగుల ఎత్తు ఉన్న యువతులు మాత్రమే పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 8247505171, 7036363272 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నియామకం

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కమిటీని నియమించింది. కమిటీ సభ్యులుగా డాక్టర్ గోపిశెట్టి రామ్మూర్తి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పాలమరశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి మూనూరు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారిలను నియమించినట్లు డీసీహెచ్ఎస్ శ్రావణ్‌కుమార్ సోమవారం చెప్పారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, కో చైర్మన్‌గా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లు వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు.

డ్రైవర్లకు కంటి పరీక్షలు



డ్రైవర్లకు మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

తుమ్మపాల : రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆర్టీవో ఎం.వీరరాజు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్టీవో కార్యాలయంలో నేత్రాలయ కంటి ఆస్పత్రి సహకారంతో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మీద ప్రయాణించేటపుడు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్టు ధరించడం వల్ల ప్రమాదాల నుంచి ప్రాణహాని లేకుండా బయటపడే అవకాశాలు పెరుగుతాయన్నారు. ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు జరిపి, అవసరమైన మందులు అందించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. 72 మందిని పరీక్షించగా ఆరుగురికి శస్త్ర చికిత్స చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు ప్రకాష్, మురళీకృష్ణ, రాజన్న, శివరామ్, గోపాల్, శిరీష, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ సౌజన్యంతో శిక్షణ, ఉపాధి

- నేడు దరఖాస్తుల స్వీకరణ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో 18 ఏళ్లు దాటిన యువతీ యువకులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు ఎంపీడీవో హేమ సుందర్రావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు చెప్పారు.

అర్హతలు.. శిక్షణ వివరాలు: దరఖాస్తు చేయడానికి అభ్యర్థి వయస్సు 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి. 10 తరగతి పాసై ఉండాలి. ఆర్నెల్లపాటు శిక్షణ ఇస్తారు. 30 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఓబీసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వారికి వయస్సు సడలింపు ఉంటుంది. అత్యాధునిక ప్లాస్టిక్ తయారీ యంత్రాలపై సుశిక్షితులైన ఫ్యాకల్టీతో బోధన, శిక్షణ ఉంటుంది. మెషీన్ ఆపరేటర్–ప్లాస్టింగ్ ప్రాసెసింగ్, మెషీన్ ఆపరేటర్–ఇంజెక్షన్ మౌల్డింగ్ కోర్సుల్లో చేరదల్చుకున్న అభ్యర్థులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న శిబిరంలో దరఖాస్తులు చేసుకోవచ్చు.

సరుగుడు సొగసులు.. తాండవ తళుకులు..

సరుగుడు జలపాతం.. మండు వేసవిలో కూడా నిండుగా ప్రవహిస్తుంది. ఎత్తైన రెండు కొండల నడుమ.. అంతే వయ్యారంగా నేలకు దూకే దీని సొగసు పర్యాటకులను ఇట్టే కట్టిపడేస్తుంది. దీన్ని ఎకో టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. జిల్లాలోని తాండవ రిజర్వాయరులో బోటు షికారు, కాటేజీలు తదితర పర్యాటక అభివృద్ధికి చర్యలు ఊపందుకున్నాయి. వీటితోపాటు గొలుగొండలోని ధారమఠాన్ని కూడా పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

- రూ.4.5 కోట్లతో పర్యాటక ప్రాజెక్టులు
- సరుగుడులో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక
- తాండవలో బోటు షికారు, క్యాంటీన్, కాటేజీల నిర్మాణం

నాతవరం: సందర్శకులను కనువిందు చేసే సరుగుడు జలపాతానికి మంచి రోజులు రానున్నాయి. జలపాతాన్ని ఎకో టూరిజంలో భాగంగా అభివృద్ధి చేసేందుకు అటవీశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. దీంతో పాటు తాండవ రిజర్వాయర్, గొలుగొండలోని ధారమఠాన్ని పర్యాటక కేంద్రాలుగా మార్చేందుకు అధికారులు దృష్టి సారించారు. సరుగుడు శివారులో ఎత్తైన రెండు కొండల నడుమ, మండు వేసవిలో సైతం జలపాతం జలజలా ప్రవహిస్తుంది. ఈ సుందరమైన అందాలను చూసేందుకు ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. గత కొన్నేళ్లుగా జలపాతం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి, కాస్తయినా అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు స్థానికులు మొర పెట్టుకుంటున్నారు. అలాగే ఉమ్మడి విశాఖ జిల్లాలో మేజర్ టూరిజం ప్రాజెక్టుగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని స్థానికుల కోరిక. గత పాలకులు దీనిపై కనీసం దృష్టి సారించలేదు.

ఎమ్మెల్యే చొరవ.. మంత్రి భరోసా

ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సరుగుడు జలపాతం, తాండవతో పాటు గొలుగొండ మండలంలో ధారమఠం జలపాతాన్ని అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించారు. ఇటీవల రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా నర్సీపట్నం విచ్చేసినపుడు ఈ అంశాలను ఎమ్మెల్యే ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సానుకూలంగా స్పందించారు. దీంతోపాటు అటవీశాఖ ఉన్నతాధికారులు కూడా సరుగుడు జలపాతాన్ని సందర్శించి రూ.3 కోట్ల వ్యయంతో ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏ విధంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందనే అంశాలపై అటవీశాఖ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన పెద్దలతో సమావేశమై చర్చించారు. సరుగుడు జలపాతం వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు, కాటేజీల నిర్మాణం, పర్యాటకులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



తాండవ జలాశయం



సరుగుడు జలపాతం (ఇన్‌సెట్) ఎకో టూరిజం అవకాశాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

రూ.కోటిన్నరతో పర్యాటక 'తాండవ'ం

తాండవ రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.కోటీ 50 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇక్కడ రిజర్వాయర్లో బోటు షికారు, కాటేజీల నిర్మాణం, క్యాంటీన్, జెట్టీల ఏర్పాటు తదితర ఏర్పాట్లపై ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. జలవనరుల శాఖ అధికారులు కూడా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కావలసిన అన్ని సదుపాయాలు తాండవ ప్రాజెక్టు వద్ద ఉన్నట్టు, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని నివేదించారు. ఈ రెండింటికి సంబంధించిన ప్రతిపాదనలను అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి పంపించారు. అదే విధంగా గొలుగొండ మండలంలో ధారమఠం కూడా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. ఆయా పనులు సకాలంలో పూర్తి చేస్తే మైదాన ప్రాంతాల్లో కూడా పట్టణాలను తలపించేలా పర్యాటక కేంద్రాలు రూపుదిద్దుకుంటాయి. అలా జరిగితే రానున్న రోజుల్లో ఈ ప్రాంతాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందనున్నాయి.

నిధులు వచ్చిన వెంటనే పనులు



సరుగుడు జలపాతాన్ని ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించాం. అలాగే తాండవ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు రూ.కోటీ 50 లక్షలతో ప్రతిపాదనలు నివేదించాం. నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. సరుగుడు జలపాతాన్ని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఇటీవల స్వయంగా పరిశీలించారు. సరుగుడు తాండవ ప్రాంతాలను లంబసింగి, అరకు మాదిరి టూరిజం ప్రాంతాలుగా తయారు చేస్తే బాగుంటుందన్నారు.

– లక్ష్మీనరసింహం, ఫారెస్ట్ రేంజర్, నర్సీపట్నం

ప్రత్యామ్నాయ జీవనోపాధితో 'పరివర్తన'



మహిళలకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ గౌతమి సాలి, జేసీ కల్పనాకుమారి

- నాటుసారా తయారీ విరమించిన వారికి స్వయం ఉపాధి పథకాలు
- 67మందికి రూ.31.5 లక్షల చెక్కు పంపిణీ చేసిన కలెక్టర్

తుమ్మపాల: నాటుసారా తయారు చేసే కుటుంబాలను గుర్తించి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. పరివర్తన–2లో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 67మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ నుంచి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సహకారంతో రూ.31.50 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయంగా వారి అభిరుచిని బట్టి వివిధ స్వయం ఉపాధి పథకాలను కల్పిస్తున్నామన్నారు. పరివర్తన కార్యక్రమంలో ఎంపిక చేసిన కుటుంబాలకు వారి అర్హతలను బట్టి ప్రభుత్వ పథకాలను అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆసక్తి ఉన్న రంగాలలో శిక్షణ ఇచ్చి వారు స్థిరపడేలా చూడాలన్నారు. ఎస్పీ గౌతమి సాలి మాట్లాడుతూ నాటు సారా తయారీలో ఎక్కువగా మహిళలు పాల్గొంన్నారని, తప్పని తెలిసినా సరే కుటుంబ పోషణ కోసం పనిచేస్తున్నారని అన్నారు. మాయ కత్వాన్ని వదిలి ప్రభుత్వం అందిస్తున్న సేవలను వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జేసీ కల్పనాకుమారి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జె.రవికుమార్ పాల్గొన్నారు.

ఏపీజీవీబీలోనే డిపాజిట్లపై అధిక వడ్డీ

- బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఉదయ్‌కిరణ్

రోలుగుంట: డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వ రంగ బ్యాంక్ ఏపీజీవీబీయేనని ఆ శాఖ అనకాపల్లి జిల్లా రీజనల్ మేనేజర్ ఉదయ్ కిరణ్ తెలిపారు. మండలంలోని కొండపాలెం రోలుగుంట బ్రాంచి మేనేజర్ నందిని ఆధ్వర్యంలో సోమవారం పొదుపు, డిపాజిట్, గృహ, ఆభరణాల రుణాలు తదితర లావాదేవీలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ 444 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 7.10 శాతం, 777 రోజులకయితే 7.50 శాతం వడ్డీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. గృహ రుణాలపై అతి తక్కువ వడ్డీ 8.45 శాతం, బంగారు ఆభరణాలపై రుణం గ్రాముకి రూ.3,550 చొప్పున 9.0 శాతం వడ్డీపై ఇస్తున్నామన్నారు.



జనరల్ బీమా చెక్కును మృతుడు రమణ భార్య లక్ష్మికి అందిస్తున్న రీజనల్ మేనేజర్

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) పథకం కింద ఏడాదికి రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షలు, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై) పథకం కింద రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంపాదనలో కొంత పొదుపు చేసుకుని, ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ బ్యాంకు లక్ష్యమన్నారు.

జనరల్ బీమాలో రూ.10 లక్షలు మంజూరు

స్థానిక కొండపాలెం బీమా మిత్రగా పని చేస్తున్న పిల్లా జయలక్ష్మి తన గ్రామానికి చెందిన పాము రమణతో రూ.500లు జనరల్ బీమా చేయించింది. గృహ నిర్మాణ పనుల్లో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. జనరల్ బీమా పథకంలో భాగంగా రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును సోమవారం మృతుని భార్య లక్ష్మికి అందించారు. చెక్కును అందించిన వారిలో రీజనల్ మేనేజర్ ఉదయ్ కిరణ్, ఉప సర్పంచ్ బంటు చిరంజీవి, మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాశిదేముళ్లున్నారు. కార్యక్రమంలో స్థానిక ఏపీజీవీబీ శాఖ నోడల్ అధికారి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

హతురాలు కొత్తపల్లి మహిళ

- ఒడిశా సరిహద్దులో గుర్తు తెలియని మృతదేహం వివరాలు లభ్యం
- అనకాపల్లికి చెందిన వ్యక్తి హత్య చేసినట్టు సమాచారం

కశింకోట : కొత్తపల్లి గ్రామానికి చెందిన మహిళ ఒడిశాలో దారుణ హత్యకు గురి అయినట్టు తెలియడం సోమవారం కలకలం రేపింది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో రెండు రోజుల క్రితం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. చిత్రకొండ సమితి దొర గూడ–పప్పులూర్ ప్రధాన రహదారిలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి నేరాన్ని అంగీకరిస్తూ సోమవారం పోలీసులకు లొంగిపోవడంతో బాధితురాలి హత్యోదంతం వెలుగు చూసింది. మరింత సమాచారం కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివ రాలివి. కొత్తపల్లికి చెందిన ఆకురాతి వరలక్ష్మి (46)కి అనకాపల్లి మండలం మాకవరం గ్రామానికి చెందిన వ్యక్తితో పరిచయం ఉంది. శ్రీకాకుళం తీసుకువెళతానని చెప్పి ఈ నెల 20న ఒడిశా–ఆంధ్ర సరిహద్దులోని చిత్రకొండ పోలీసు స్టేషన్ పరిధి కాకరపాడు వద్ద మారుమూల ప్రాంతానికి ఆమెను తీసుకువెళ్లిన నిందితుడు పీక కోసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు సోమవారం అనకాపల్లి పట్టణ పోలీసు స్టేషన్‌లో నేరాన్ని అంగీకరిస్తూ లొంగిపోయినట్టు సమాచారం. అనకాపల్లి పట్టణ ఎస్ఐ సత్యనారాయణను సంప్రదించగా ఇంకా పూర్తిగా విచారణ జరపాల్సి ఉందన్నారు.

పెదబొడ్డేపల్లి హైస్కూల్లో డిప్యూటీ డీఈవో విచారణ

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలతో దర్యాప్తు

నర్సీపట్నం: విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలతో పెదబొడ్డేపల్లి హైస్కూల్లో డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ విచారణ ప్రారంభించారు. ఈనెల 21న ఉన్నత పాఠశాలను సందర్శించిన సందర్భంగా పుస్తకాల పంపిణీ, ఉపాధ్యాయుల పనితీరులో ప్రవీణ్ ప్రకాష్ పలు లోటుపాట్లను గుర్తించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తూ కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే బాధ్యతరహితంగా వ్యవహరించడం తగదని ఉపాధ్యాయులు, అధికారులపై ఆయన ఆగ్రహించారు. సమగ్రంగా విచారణ చేసి నివేదిక సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డిని ఆదేశించారు. దీనిపై విచారణ చేసేందుకు డీఈవో డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంఈవో, ఐదుగురు హెచ్ఎంలతో ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ కమిటీ సోమవారం పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమై అన్ని అంశాల్లో లోతుగా విచారణ చేపట్టింది. డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో పుస్తకాల పంపిణీ, నోట్ బుక్స్ దిద్దుబాటు, పాఠ్యాంశాల బోధన, మధ్యాహ్న భోజనంతోపాటు అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. విచారణ పూర్తయిన తర్వాత డీఈవోకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఇకపై ఇదే తరహాలో అన్ని పాఠశాలల్లో విచారణ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.



హెచ్ఎం, ఉపాధ్యాయులను విచారిస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్


పంచాయతీల్లో డిజిటలైజేషన్

- పీవోఎస్ మిషన్ల ద్వారా పన్నుల వసూళ్లు
- ప్రయోగాత్మకంగా తుమ్మపాలలో అమలు
- లావాదేవీలు పారదర్శకం
- నిధుల దుర్వినియోగానికి చెక్

అనకాపల్లి రూరల్: పన్నులు వందశాతం వసూలైతే గ్రామాల అభివృద్ధికి మరింత అవకాశం వుంటుంది. పంచాయతీల్లో ఆస్తిపన్ను వసూళ్లు వందశాతం పారదర్శకంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పన్నుల వసూళ్లకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఆస్తిపన్నుల వసూళ్ల డిజిటలైజేషన్ ద్వారా పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా వందశాతం పన్ను వసూళ్లు చేసేందుకు ప్రక్రియ ఉపయోగపడనుంది. ఇందుకోసం పన్నుల వసూళ్లలో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రయోగాత్మకంగా జిల్లాలో తుమ్మపాల మేజర్ పంచాయతీలో ఈ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. క్రమేణా అన్ని మేజర్ పంచాయతీల్లోనూ.. ఆ తరువాత మైనర్ పంచాయతీల్లో ఇదే విధానాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రయోగాత్మకంగా తుమ్మపాలలో..

డిజిటలైజేషన్ ఇప్పటి వరకూ ఈ ప్రక్రియ నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో అమలవుతోంది. ఈ క్రమంలో జిల్లాలో తుమ్మపాల మేజర్ పంచాయతీని ఆస్తిపన్ను డిజిటలైజేషన్ ప్రక్రియకు ఎంపిక చేశారు. ఇందుకోసం గ్రామ పంచాయతీ కార్యదర్శిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రత్యేకంగా అకౌంట్ ప్రారంభించాలని అధికారులు ఆదేశించారు. తుమ్మపాల పంచాయతీలో 4157 అసెస్‌మెంట్లు వున్నాయి. వాటి నుంచి వార్షిక పన్నుల డిమాండ్ లక్ష్యం రూ.33,87,098 కాగా ప్రస్తుతం రూ.16,59,192 మేర గత సంవత్సరాల పెండింగ్ బకాయిలు ఉన్నాయి. ఈ ఏడాది ఇంతవరకూ 25 శాతం మాత్రమే పన్నులు వసూలు చేయగలిగారు. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు రానున్న రెండు మూడు నెలల్లో 90 శాతానికి పైగా పన్నులు వసూలయ్యే అవకాశాలున్నాయి. ఆ పంచాయతీ పరిధిలో క్యూఆర్ కోడ్ స్కానింగ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా పన్నుల చెల్లింపులు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు. తుమ్మపాల పంచాయతీ అధికారులకు పాయింట్ ఆఫ్ సేల్ డివైసెస్ (పీవోఎస్ మిషన్లు) వినియోగించేలా మిషన్లను అందుబాటులోకి తెచ్చారు.



ఆస్తి పన్ను డిజిటలైజేషన్ కోసం ఎంపికైన తుమ్మపాల పంచాయతీ



చెల్లింపుల ప్రక్రియ ఇలా ?

గ్రామాలవారీగా ఇంటి యజమాని వివరాలు, ఇంటి విస్తీర్ణం భవన నిర్మాణ తీరు ఆధారంగా నిర్ధారించిన పన్నుల వివరాలన్నీ పీవోఎస్ మిషన్లతో అనుసంధానించిన సాఫ్ట్‌వేర్‌లో పంచాయతీ అధికారులు అప్‌లోడ్ చేస్తారు. కోడ్ నెంబరును పీవోఎస్ మిషన్‌లో ఎంటర్ చేయగానే చెల్లించాల్సిన పన్ను మొత్తం స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ పన్నుల వివరాలను బట్టి ఇంటి యజమాని ఆన్‌లైన్‌లో నగదు చెల్లించే మార్గాలను చూపిస్తుంది. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర వాటిల్లో ఎంపిక చేసుకుని క్రెడిట్, డెబిట్ కార్డు లేదా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి నగదు చెల్లిస్తే నేరుగా పంచాయతీ అకౌంట్‌కు జమ అవుతుంది.

ఆదేశాలు అందాయి



ఇంటి పన్ను వసూళ్లలో ప్రయోగాత్మకంగా డిజిటలైజేషన్ అమలు చేసేందుకు తుమ్మపాల మేజర్ పంచాయతీని ఎంపిక చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ నుంచి ఈ మేరకు ఆదేశాలు అందాయి. ఇందుకు సంబంధించి కసరత్తు చేస్తున్నాం. జిల్లా పంచాయతీ అధికారి, ఈవోపీఆర్‌డీ ఆదేశాలు, సూచనల మేరకు చర్యలు చేపడుతున్నాం.

–కె.శ్రీనివాస్, ఈవో, తుమ్మపాల పంచాయతీ

ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్, జి-20 సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, హాజరైన అనకాపల్లి, విశాఖ జిల్లాల భారీ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు

- రూ.200 కోట్లతో నగర సుందరీకరణ
- అంతర్జాతీయ స్థాయిలో నగరాన్ని తీర్చిదిద్దాలి
- అంతర్జాతీయ సదస్సులతో రాష్ట్రానికి ఎంతో మేలు
- పారిశ్రామిక వేత్తలతో మంత్రి అమర్‌నాథ్ భేటీ

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : మార్చిలో విశాఖలో జరగనున్న రెండు అంతర్జాతీయ సదస్సులను విజయవంతం చేసేందుకు వివిధ పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన భారీ పరిశ్రమల ప్రతినిధులతో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన కన్సల్టెంట్ కం ఇంటరాక్షన్ మీట్‌లో మంత్రి అమర్‌నాథ్ మాట్లాడారు. మార్చి మూడు, నాలుగు తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు విశాఖలో నిర్వహించనున్నామని, అదే నెల 28, 29, 30వ తేదీల్లో భారతదేశం నాయకత్వం వహిస్తున్న జీ–20 సదస్సు విశాఖలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి 45 దేశాలకు చెందిన సుమారు 250 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఇటువంటి జీ–20 సదస్సులు దేశంలోని 50 ప్రాంతాల్లో నిర్వహించనున్నారని, మౌలిక సదుపాయాల అంశంపై విశాఖ నగరంలో జీ 20 సదస్సు జరగబోతోందని మంత్రి అమర్‌నాథ్ వివరించారు. ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన ఈ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యమివ్వటం మనమంతా గర్వంగా భావించాలని, ఈ సదస్సును విజయవంతం చేయడం ద్వారా రాష్ట్రానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయని ఆయన చెప్పారు. గతంలో విశాఖ నగరంలో అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులు జరిగాయని, ఆయా సదస్సులను దృష్టిలో పెట్టుకుని నగరంలో తాత్కాలిక సుందరీకరణ పనులు చేపట్టారని, ఈసారి శాశ్వత ప్రాతిపదికన పనులు జరగాలని మంత్రి అమర్‌నాథ్ అధికారులను ఆదేశించారు.

పనుల నాణ్యత కూడా అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని ఆయన సూచించారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు ఉన్న రహదారి అభివృద్ధి చేయడం, నగరంలో ఉన్న పర్యాటక కేంద్రాలను విదేశీయులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దడం వంటి పనులు శరవేగంగా చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఉన్న భారీ పరిశ్రమల యాజమన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడ్డ లైన్‌మన్ చిరంజీవి

మాకవరపాలెం: రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలవ్వగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్‌మన్‌గా పనిచేస్తున్న చిరంజీవి మోటార్ సైకిల్‌పై సోమవారం మాకవరపాలెం వైపు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టడంతో చిరంజీవి కాలు విరిగిపోగా, మరో బైక్‌పై వస్తున్న యలమంచిలి గ్రామానికి చెందిన మాడుగుల గణేష్‌కుమార్, ములగపాక నానాజీలకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వీరిని స్థానికులు 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రతి అర్జీదారుకు స్పష్టమైన సమాధానం

- కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి
- కలెక్టరేట్ స్పందనకు 111 అర్జీలు

తుమ్మపాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీపై విచారణ చేసి పరిష్కరించి, స్పష్టమైన సమాధానం అర్జీదారుడికి అందించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులకు స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేయడం, అర్జీదారుడికి సంతృప్తికరమైన సమాధానం అందించడంలో అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. దివ్యాంగుల సమస్యలను డీఆర్వో పి.వెంకటరమణ, ఎస్‌డీసీ అనిత తెలుసుకున్నారు. వీటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 111 అర్జీలు నమోదయ్యాయి.

అర్జీలు రాసేందుకు ప్రత్యేక శిబిరం.....

నిరక్షరాసులు, దివ్యాంగుల సమస్యలను అర్జీల రూపంలో రాసేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలో ఇద్దరు వీఆర్వోలతో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. దీంతో వీఆర్వోలు వారి సమస్యలను తెలుసుకుని అర్జీల రూపంలో రాసి పంపుతున్నారు. గతంలో ఇక్కడ అర్జీలు రాసేందుకు కొందరు ప్రైవేటు వ్యక్తులు నగదు వసూలు చేస్తున్నట్లు జేసీ కల్పనాకుమారి దృష్టికి వెళ్లడంతో ఇలాంటి సౌకర్యం కల్పించారు.

వైఆర్సీ కాలువ మీదుగా ఐదు గ్రామాలకు రోడ్డు వేయండి..

కశింకోట మండలం తాళ్లపాలెం నుంచి అడ్డాం, చెరకాం, అచ్చర్ల, మోసయ్యపేట, రెడ్డివానిపాలెం గ్రామాలకు వైఆర్సీ కాలువ మీద బ్రిడ్జి వేసి కాలువ గట్టుపై సీసీరోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు స్పందనలో కలెక్టర్‌కు వినతి అందించారు. తాళ్లపాలెం నుంచి వైఆర్సీ కాలువ గుండా తమ గ్రామాలకు చేరుకోవాలంటే కన్నూరుపాలెం, తీడ గ్రామాలకు వెళ్లి కాలువపై బ్రిడ్జి దాటుకుని రావటానికి 20 కిలోమీటర్ల దూరం, సమయం వృథా అవుతుందని వాపోయారు. ఐదు గ్రామాల పరిధిలో బ్రిడ్జి వేస్తే ఐదు కిలోమీటర్ల మేత్రమే ఉంటుందన్నారు. ఈ సమస్యను ప్రత్యేక దృష్టితో విచారణ చేసి మెరుగైన రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్‌లు చేకూరి మహేష్‌రాజు, నిమ్మదాల సోమేష్, నిస్కా రమణ, సీహెచ్ సత్యనారాయణ కోరారు.



స్పందన అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, డీఆర్వో వెంకటరమణ



స్పందనలో మహిళతో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిసాలి



ప్రత్యేక శిబిరంలో సమస్యలను తెలుసుకుని అర్జీలు రాస్తున్న సిబ్బంది

అంగన్‌వాడీ కార్యకర్త నియామకంలో అవకతవకలు...

పరవాడ మండలం బొద్దపువానిపాలెం అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు నియామకం ఏకపక్షంగా జరిగిందని, విచారణ చేపట్టి నియామకాన్ని రద్దు చేయాలని తొమ్మిది మంది మహిళా అభ్యర్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ పోస్టుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ప్రక్రియలో దరఖాస్తు చేయని కంచపాటి చంద్రకళను నియమించడం అన్యాయమని వాపోయారు. తక్షణమే విచారణ చేపట్టి దరఖాస్తులు చేసుకున్న వారికి నిష్పక్షపాతంగా ఇంటర్వ్యూలు చేపట్టాలని గ్రామ మహిళలు గెడ్డం నాగేశ్వరి, చిలకల ఝాన్సీరాణి, ముద్దు త్రిపుర, అక్కిరెడ్డి సరోజ, తాడి దుర్గాదేవి, గెడ్డం లావణ్య, నార పిన్ని రాశి, కంపర పూర్ణ కోరారు.

108 ఉద్యోగుల నిరాహార దీక్ష.....

108 ఉద్యోగులను వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు రెండో రోజు సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో 108 ఉద్యోగులకు ఈఎంటీ, పైలట్‌లకు సర్వీస్‌ను బట్టి వెయిటేజీ ఇవ్వాలన్నారు. ఉద్యోగుల బకాయిలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అందరికి సమాన వేతనం చెల్లిస్తూ ఏటా జీతంలో 20 శాతం పెంపు చేయాలన్నారు.

ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలు చెల్లించాలి..

ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయి వేతనాలను చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద కార్మికులు ధర్నా చేశారు. ప్రత్యామ్నాయ ఉపాధి లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫ్యాక్టరీని తెరిపించి రైతులకు, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, కె.రమణ, ఎ.సత్యనారాయణ, పి.వెంకన్న పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 23 అర్జీలు

అనకాపల్లి టౌన్: చట్ట పరిధిలో అర్జీలను పరిష్కరిస్తామని ఎస్పీ గౌతమిసాలి భరోసా ఇచ్చారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 23 అర్జీలు వచ్చినట్టు ఆమె పేర్కొన్నారు. అర్జీలదారుల సమస్యల పరిష్కారానికి జిల్లాలో ఆయా పోలీస్ స్టేషన్ల సీఐ, ఎస్ఐలను ఆదేశించామన్నారు.

జన్మభూమి హాల్ట్ కోసం సంతకాల సేకరణ



జన్మభూమి హాల్ట్ కోసం స్టేషన్‌లో చార్ట్‌పై సంతకాలు పెడుతున్న ప్రయాణికులు

ఎస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌లో జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేయాలని పలువురు ప్రయాణికులు సంతకాల సేకరణ చేపట్టారు. నిత్యం వేలాది మంది ప్రయాణం చేసే ఈ స్టేషన్‌లో జన్మభూమి సూపర్ ఫాస్ట్ సమయాలు చాలా కీలకంగా ఉన్నాయని ఆ రైలు నిలిపితే నిరుద్యోగులకు, రైతులకు, చిరువ్యాపారులకు ఎంతో అనువుగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ స్టేషన్ నుంచి నిత్యం పాయకరావుపేట, యలమంచిలి, నర్సీపట్నం నియోజకవర్గాల్లో ఎస్.రాయవరం, నక్కపల్లి, ఏటికొప్పాక, కోటఉరట్ల, నర్సీపట్నం మండలాలనుంచి అధిక సంఖ్యలో ప్రయాణికులు వచ్చి వెళుతుంటారు. ఇప్పటికే ఈ స్టేషన్‌లో సింహాద్రి, టాటా అలెప్పీ ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్, కాకినాడ-విశాఖపట్నం, తిరుమల, రాయగడ ఎక్స్‌ప్రెస్‌లు గోదావరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు ఆగుతున్నాయి. ఉదయం వేళలో విజయవాడ, హైదరాబాద్ వెళ్లడానికి, సాయంత్రం వేళలో విశాఖపట్నం వెళ్లేందుకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ అనువుగా ఉంటుందని చెబుతున్నారు. ఈ మేరకు రైల్వే ఉన్నతాధికారులు ఇక్కడ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైలు హాల్టు ఇవ్వా లని కోరుతున్నారు.

చిత్రం.. భళారే విచిత్రం!

- చోడవరం కళాకారుడి చిత్రానికి జాతీయ బహుమతి



బంగారు పతకం సాధించిన చిత్రం

చోడవరం: చెట్ల ఆకులే కాదు.. బెరడు కూడా జీవం పోసుకుంది. గీత కార్మికుడే కాదు.. అతని చేతి కండరాలు కూడా ప్రాణం ఉన్న బొమ్మను తలపిస్తున్నాయి. జాతీయస్థాయి చిత్ర కళా ప్రదర్శనలో చోడవరం చిత్రకారుడు బంగారు పతకం సాధించారు. చోడవరం చిత్రకళానిలయం నిర్వాహకుడు బొడ్డేడ సూర్యనారాయణ గీసిన చిత్రాలకు బహుమతులు లభించాయి. ఇటీవల అమలాపురంలో కోనసీమ చిత్రాకళా పరిషత్ జాతీయ చిత్రకళా ప్రదర్శన నిర్వహించింది. గిరిజన సంప్రదాయం, కల్లు గీత కార్మికుల జీవన విధానంపై బొడ్డేడ సూర్యనారాయణ గీసిన చిత్రాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కల్లు గీత కార్మికుడి చిత్రానికి బంగారు పతకం లభించింది. గిరిజన మహిళల సంప్రదాయ అలంకరణపై వేసిన చిత్రం లెజెండ్ చిత్రంగా జ్యూరీ అవార్డు అందుకుంది. సూర్యనారాయణను చోడవరం ఫోరం ఫర్ బెటర్ చోడవరం సభ్యులు, స్థానిక చిత్రకారులు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందించారు.



లెజెండ్ జ్యూరీ అవార్డు సాధించిన చిత్రం



బంగారు పతకం అందుకుంటున్న చిత్రకారుడు బొడ్డేడ

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- ఇంజినీరింగ్ విద్యార్థి మృతి
- మరో ఇద్దరికి గాయాలు

మాకవరపాలెం : బైక్‌తో ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు.. తూర్పుగోదావరి జిల్లా రాజోలు మండలం పొదలాడకు చెందిన లంకె తరుణ్‌బాబు, సింగిరెడ్డి దినేష్ (విజయనగరం), రావాడ లోకేష్ (శ్రీకాకుళం)లు మండలంలోని తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు. వీరంతా కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. అయితే ఆదివారం రాత్రి మోటారు సైకిల్‌పై నర్సీపట్నం వెళ్లిన వీరు తిరిగి వస్తుండగా రాచపల్లి జంక్షన్ సమీపంలో కామేశ్వరమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. దీంతో తరుణ్‌బాబు అక్కడికక్కడే మృతి చెందగా, దినేష్ తీవ్రంగా, లోకేష్ స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న దినేష్‌ను విశాఖ తరలించారు. ఈ సంఘటనలో బైక్ నుజ్జునుజ్జయింది. తరుణ్‌బాబు మృతి చెందడంతో తోటి విద్యార్థులు, కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.



మృతి చెందిన తరుణ్‌బాబు, తరుణ్‌బాబు (ఫైల్)

అభిరుచులకు అనుగుణంగా బంగారు ఆభరణాలు



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- అనకాపల్లిలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌ను ప్రారంభించిన మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: సాంప్రదాయ, సమకాలీన అభిరుచులకు తగ్గట్టుగా పలు డిజైన్లలో బంగారు ఆభరణాలను మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జిల్లా ప్రజలకు మరింత చేరువ చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆకాంక్షించారు. స్థానిక సత్యనారాయణ థియేటర్ వద్ద షోరూమ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 4000 చదరపు అడుగుల విస్తీర్ణంలో సువిశాలమైన షోరూమ్‌లో సమస్త డిజైన్లలో ఆభరణాలను అందించడం ఆనందదాయకమన్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం హయాంలో అనకాపల్లి జిల్లా కేంద్రంగా ప్రకటించడంతోపాటు పట్టణంలో ఈ షోరూమ్ ప్రారంభం కావడం జిల్లావాసులు పక్క జిల్లా విశాఖపట్నానికి వెళ్లాల్సినవసరం లేదన్నారు. ఏపీ, తెలంగాణ హెడ్ రాకేష్‌కుమార్ మాట్లాడుతూ ఏపీలో 15వ షోరూమ్‌ను అనకాపల్లిలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. షోరూమ్ ద్వారా ఆర్జించిన లాభాల్లో 5 శాతం మొత్తాన్ని ఇదే ప్రాంతంలో వివిధ ధార్మిక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు, జోనల్ తహసిల్ అహ్మద్, రీజనల్ హెడ్ షారీజా, అసిస్టెంట్ మేనేజర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రేవుపోలవరంలో షూటింగ్ సందడి



రేవుపోలవరం తీరంలో షూటింగ్ సందడి

ఎస్.రాయవరం : ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరొందిన రేవుపోలవరం తీరంలో సోమవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. కల్ట్ ప్రొడక్షన్ పేరుతో నిర్మాణం కాబోతున్న దక్షిణ చిత్రంలో ఓ సన్నివేశం చిత్రీకరిస్తున్నట్టు నిర్మాణ అశోక్ షిండే చెప్పారు. తీరం పరిసర ప్రాంతాల్లో మూడు రోజుల పాటు పలు సన్నివేశాలు, పోరాట దృశ్యాలు చిత్రీకరిస్తామన్నారు. ఇందులో నటులు సాయిదన్విక్ , రిషల్‌బసు, అంకిత, నవీన్ స్నేహసింగ్ ఫణి తదితరులు ఉన్నారన్నారు. దర్శకుడు తులసీరామ్ సినిమాను తెరకెక్కిస్తున్నట్టు చెప్పారు. సినిమా షూటింగ్‌ను వీక్షించేందుకు స్థానికులు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరిచారు.

నైపుణ్య కోర్సులకు ఉచిత శిక్షణ

చోడవరం : ఉచిత నైపుణ్యాభివృద్ధి కోర్సులకు చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కాలేజీ ప్రిన్సిపాల్ కె.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చోడవరం కాలేజీలో మంజూరు చేసిన స్కిల్ హబ్‌లో ఈ కోర్సులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. టైలరింగ్, ఏసీ టెక్నీషియన్ కోర్సుల్లో రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. టైలరింగ్‌కు 8వ తరగతి, ఏసీ టెక్నీషియన్‌కు 10వ తరగతి కనీస విద్యార్హత కలిగి ఉండాలన్నారు. శిక్షణ పొందాలనుకున్న అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి నెల నుంచి నెల నుంచి శిక్షణ ప్రారంభమౌతుందన్నారు. వివరాలకు 9133203064, 9492807312 సంప్రదించాలన్నారు.

మద్యం మత్తులో సరుగుడు లారీపై దాడి

- నలుగుర్ని అరెస్టు చేసిన పోలీసులు

చోడవరం : అటుగా వెళుతున్న సరుగుడులోడు లారీపై మందుబాబుల వీరంగం చేసి అద్దాలు పగులగొట్టిన కేసులో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు చోడవరం ఎస్ఐ అప్పలనాయుడు సోమవారం తెలిపారు. సబ్బవరం మండలం వంగలి గ్రామానికి చెందిన సరుగుడు లారీ యజమాని గవర కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. ఆదివారం రాత్రి చుక్కపల్లి నుంచి గజపతినగరం వే బ్రిడ్జి కాటాకు సరుగుడు లోడు వేసుకొని వస్తుండగా చోడవరం మండలం ఖండిపల్లి రోడ్డులో అన్నవరం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు పూటుగా మద్యం మత్తులో వెళ్లి లారీని అడ్డగించి దాడి చేశారు. లారీ అద్దాలు పగులగొట్టి, డ్రైవర్ నుంచి రూ. 400 డబ్బులు వసూలు చేసి వీరంగం చేయడంతో లారీ డ్రైవర్ చోడవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకొని వీరంగం చేస్తున్న మందుబాబులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. గొడవ చేసిన గులజాన సాయి దుర్గాప్రసాద్, పిల్ల జగదీష్, మహారాజు ప్రసాద్, కోటి మనోహర్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్ఐ అప్పలనాయుడు తెలిపారు.

యువ రచయిత శ్రీను మృతికి సంతాపం



ఉగ్గిన శ్రీను (ఫైల్)

రావికమతం: రావికమతం గ్రామానికి చెందిన యువ రచయిత ఉగ్గిన శ్రీను ఆదివారం రాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. డిగ్రీ వరకూ చదివిన అతడు తన రచనలు, కవితల ద్వారా సామాజిక చైతన్యాన్ని రగిల్చారు. వీటికి గుర్తింపుగా గత ఏడాది ప్రకాశం జిల్లా రచయితల సంఘం తరపున తెలుగు ప్రాభవ పురస్కారం, శ్రీశ్రీ కళావేదిక పురస్కారం వరించాయి. పున్నమి, ఉస్మానియా తెలుగు రచయితల సంఘం తరపున ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కుమారుడు హఠాన్మరణంతో శ్రీను కుటుంబీకులు, మిత్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక సంఘం, కవి మిత్ర పరివారం, విశాఖ జిల్లా శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులు శ్రీను భౌతిక కాయాన్ని సోమవారం సందర్శించి ఘన నివాళులర్పించారు.

అగ్ని ప్రమాదంలో హెచ్‌ఎం మృతి



మృతుడు నాగేశ్వర్రావు (ఫైల్)

రోలుగుంట : కొమరవోలు గ్రామంలో గల ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్రి నాగేశ్వర్రావు (61) అగ్నిప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన శనివారం నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో పెద బొడ్డేపల్లి గ్రామంలో గల తన ఇంట్లో రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. అయితే అతను కాల్చి పడేసిన సిగరెట్ కారణంగా కొంత సమయానికి మంటలు రేగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో అతను తీవ్రంగా కాలి గాయపడ్డారు. వెంటనే అతనిని కుటుంబీకులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్టు ఆయన కుటుంబీకులు తెలిపారు. మృతుని భార్య లక్ష్మి రోలుగుంట మండలంలో కుసుర్లపూడి ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమార్తె ఉన్నారు.

సందడిగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ తీర్థం




నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సోల్జర్స్ సభ్యులు, గ్రామ పెద్దలు

మాడుగుల రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని కె.జె.పురంలో సోమవారం ఆయన విగ్రహం వద్ద తీర్థం ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతాజీ సోల్జర్స్ యూత్ 2007-2008 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో చంద్రబోస్ విగ్రహం వద్ద విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, హైస్కూలు విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, తదితర సామగ్రి పంపిణీ చేశారు. కబడ్డీ, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, ఎంపీటీసీ భీశెట్టి శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కాళ్ల అమ్మతల్లినాయుడు, హైస్కూలు పీడీ ప్రసాదు, తదితరులు నేతాజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరిస్తే ఉద్యమం ఉధృతం

- రిలే నిరాహార దీక్షలో ఉద్యమకారులు

చోడవరం: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చోడవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షను సోమవారం నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఈ దీక్ష చేపట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలన్న యోచన విరమించుకోవాలని ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న ఉద్యమకారులంతా ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. ఎంతో మంది బలిదానమై కాపాడుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మితే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై మరింత ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. జిల్లా, డివిజన్ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, రాజాన దొరబాబు, ఎం. మన్మథరావు, జి.గురుబాబు, వైఎస్ భద్రం, గోవాడ కనకమహాలక్ష్మి, బొబ్బిలి మణి, విస్సారపు నాగూర్, కోన లక్ష్మన్, జి. ఫణీంద్ర పాల్గొన్నారు.



చోడవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న సీపీఐ నాయకులు

క్లుప్తంగా

4వ సచివాలయం పరిధిలో 'గడప గడపకు' నేడు

కశింకోట : కశింకోటలోని 4వ సచివాలయం పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభంకానున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీసి, ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, ప్రజలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

వివేకానంద విగ్రహ స్థాపన



ప్రధాన రహదారిపై స్వామి వివేకానంద విగ్రహం

కశింకోట : కశింకోటలోని పంచాయతీ కార్యాలయ ప్రధాన రహదారిపై స్వామి వివేకానంద విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ గతంలో చిన్న విగ్రహం ఉండేది. దాని స్థానంలో పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ ఉత్సవం



అమ్మవారి మూల విరాట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

అనకాపల్లిటౌన్ : స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం జరిగింది. అమ్మవారి మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ మండపంలో 102 వెండి ప్రమీదలతో అమ్మవారికి దీపారాధన చేశారు. వ్యాపారవేత్త ఉప్పల శ్రీరామ్ ఆర్థిక సహాయంతో ఆలయానికి వచ్చే భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పుల శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
వాల్తేరు వీరయ్య	- సత్యనారాయణ స్క్రీన్-1
వీర సింహారెడ్డి	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డిసాయి
వారసుడు	- పర్తిసాయి
వీర సింహారెడ్డి	- వెంకటేశ్వర
వారసుడు	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 8,622 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,150	4,060
మొదటి రకం	3,030	3,530
రెండో రకం	2,840	3,200
మూడో రకం	2,760	2,830

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–8 యూనిట్లు, ఏ నెగిటివ్–2 యూనిట్లు, బీ పాజిటివ్–2 యూనిట్లు, బీ నెగిటివ్–2 యూనిట్లు, ఓ పాజిటివ్ 12 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 468 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 395 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

పర్యావరణానికి ప్లాస్టిక్ పొగ

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాల దహనం
- డంపింగ్ యార్డుకు తరలించడంలో నిర్లక్ష్యం
- జగనన్న స్వచ్ఛ సంకల్పానికి సిబ్బంది తూట్లు

అనకాపల్లి రూరల్: గృహాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్న సంకల్పంతో ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం(జేఎస్ఎస్) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తోంది. ఇందుకు సచివాలయాల పరిధిలో సంపద కేంద్రాల సమర్థ నిర్వహణ, షెడ్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టింది. కానీ కొంతమంది సిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ జేఎస్ఎస్ కార్యక్రమానికి తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాలనీలు, గృహసముదాయాల నుంచి చెత్తను సేకరించి ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించడంలో తుమ్మపాల, పిసినికాడ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. రోజుల తరబడి నివాస ప్రాంతాలు, రహదారుల పక్కన చెత్త పేరుకుపోతే దోమలు పెరిగిపోతాయని వైద్యాధికారులు చెప్తున్నారు.

రోడ్ల పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాల దహనం

చెత్తను డంపింగ్ యార్డులకు తరలించలేక ఎక్కడపడితే అక్కడ రహదారులపై ప్లాస్టిక్ వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది దహనం చేస్తున్నారు. నిబంధనల మేరకు ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా డంపింగ్ యార్డుకు తరలించాలి. వీటికి నిప్పు పెట్టడం వల్ల వెలువడే పొగలో కార్బన్ మోనాక్సైడ్ వంటి విషపూరిత వాయువులు వెలువడతాయని వైద్యులు చెబుతున్నారు. ఇవి గాలిలో కలిసిపోయి స్వచ్ఛమైన గాలిని కలుషితం చేస్తాయి. ఈ కలుషితమైన గాలిని పీల్చడం వలన మనుషులు, ఇతర జంతువుల ఆరోగ్యం పాడవుతుంది. ముఖ్యంగా శ్వాశకోశ సంబంధిత వ్యాధుల బారిన పడతారు. ఒక్కోసారి దీర్ఘకాలిక అనారోగ్యానికి కూడా ఈ పొగ కారణమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వాహన చోదకులకు ఇక్కట్లు

రహదారుల పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెట్టడం వలన పరిసరాలన్నీ పొగతో నిండి, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల నివాస గృహాల్లో వారికి అవస్థలు తప్పడంలేదు. నిజానికి బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి వ్యర్థాలనూ దహనం చేయరాదని స్పష్టమైన నిబంధనలున్నాయి. అయినప్పటికీ కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పర్యావరణానికి విఘాతం ఏర్పడుతోందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షణ జరిపి పర్యావరణ పరిరక్షణకు, పంచాయతీల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తుమ్మపాలలో రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాల దహనంతో వెలువడుతున్న పొగ

అత్యంత ప్రమాదకరం



కర్బన సమ్మేళనాలను కాల్చడం అత్యంత ప్రమాదకరం. ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేయడం వలన వాటి నుంచి వెలువడే విష వాయువులు త్వరగా గాలిలో కలిసిపోయి పీల్చే గాలిని కలుషితం చేస్తాయి. కలుషిత గాలిని పీల్చి మనుషులతోపాటు, ఇతర జంతువులు కూడా రోగాలబారిన పడుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవడం కన్నా, వాటిని దహనం చేయడం వల్ల ఏర్పడే వాతావరణ కాలుష్యం అతి త్వరగా, ఎక్కువగా మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలి.

– కొయిలాడ రామ్మోహనరావు, విశ్రాంత అధ్యాపకులు, రసాయనశాస్త్రం

పునరావృతం కాకుండా చర్యలు



ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చరాదు. పారిశుధ్య సిబ్బందికి దీనిపై స్పష్టమైన ఆదేశాలిస్తాం. మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. పంచాయతీ పరిధిలో ఎక్కడైనా ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేస్తే ప్రజలు మా దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం.

– కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, తుమ్మపాల

నల్లమారమ్మ సన్నిధిలో దాడి దంపతులు



నల్లమారమ్మను దర్శించుకున్న దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు

కశింకోట : మండల శివారులో ఉన్న నల్లమారమ్మ అమ్మవారిని వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు సోమవారం దర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారి తీర్థ మహోత్సవం పురస్కరించుకుని హాజరైన రత్నాకర్ దంపతులకు ఉత్సవ కమిటీ తరఫున ఆహ్వానించి పుష్పగుచ్ఛాలు అందించి, దుశ్శాలువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కారెడి నాగేశ్వరరావు, ముత్తుర్తి శ్రీను, ధనంరెడ్డి బాబూరావు, అందె రమణ, చర్లపూడి వెంకట్, ఉగ్గిన భాస్కరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు వేగి దొరబాబు, దాడి కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు కొయిలాడ నాగు, వేగి పవన్‌కుమార్, కోటిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో కూరగాయల ధరలు స్వల్పంగా పెరిగాయి. ఉల్లి, టమాటా కిలోకు రూ.5 అదనంగా పెరిగింది. రూ.25 నుంచి రూ.30 వరకు అమ్మకాలు సాగాయి. బంగాళాదుంపలు, క్యాబేజీ, నీటి వంకాయ రూ.30, బీరకాయ రూ.40, బీట్‌రూట్, క్యారెట్, బెండకాయ, తెల్ల వంకాయ, బరబాటి, దొండకాయ రూ.60, క్యాప్సికం రూ.80కి అమ్మకాలు జరిగాయి.

పొక్లెయిన్ బోల్తా.. తప్పిన ప్రమాదం



ఇటుకల బట్టీ వద్ద బోల్తా పడిన పొక్లెయిన్

కశింకోట : స్థానిక గవరపేట ప్రాంతంలో శారదానది అవతల ఉన్న ఓ ఇటుకల బట్టీలో సోమవారం పొక్లెయిన్ బోల్తా పడింది. ఇద్దరు వ్యక్తులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. గవరపేటలోని ఇటుకల బట్టీ ప్రాంతంలో మట్టిని తీసి ట్రాక్టర్ తొట్టి నింపుతున్న పొక్లెయిన్ అదుపు తప్పి ఒక పక్కగా నేలకొరిగింది. దీంతో దానిలోని డ్రైవర్ కేబిన్ తలుపు తెరిచి కింద భాగంలో ఉన్న ఖాళీ నుంచి వెలుపలకు సురక్షితంగా బయటపడ్డాడు. అలాగే ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదం గుర్తించి ముందుగా ట్రాక్టర్ నుంచి దూకేశాడు. లేదంటే వారు ప్రమాదానికి గురయ్యేవారని స్థానికులు తెలిపారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించాలని పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవ గోడపత్రికలను మిందిలోని తన స్వగృహంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 137 సంవత్సరాల చరిత్ర కలిగిన గౌరీపరమేశ్వరుల ఉత్సవానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ నెల 28న అమ్మవారి ఉత్సవాన్ని ప్రశాంతమైన వాతావరణలో నిర్వహించాలని సూచించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొణతాల సంతోష్‌అప్పారావునాయుడు, కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కె.నూకమహలక్ష్మీనాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులను ప్రారంభిస్తున్న దిలీప్ కుమార్

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల మేజర్ పంచాయతీలో సోమవారం జాతీయ ఉపాధి హామీ పథకం పనులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ ప్రారంభించారు. సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు ఆధ్వర్యంలో ప్రారంభమైన పనుల్లో తొలి రోజు 200 మంది కూలీలు పాల్గొన్నారు. నడింకాలువ వద్ద భూమి పూజ చేసి ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ కూలీలు వలసలు పోకుండా ఈ పనులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మగశాల లక్ష్మీ వెంకట్, అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పీడీ గాంధీ, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు భవానీ శ్రీను, జెర్రిపోతుల శ్రీలక్ష్మి, వెలగా నూకరత్నం, మోదినాయుడు, చదరం చిన్న, సత్యారావు, నాగరాజు, పడాల గణపతి, ఆర్టీసీ సత్యనారాయణ, బొడ్డపాటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రాధాన్యంపై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నక్కపల్లి : ఓటు హక్కు ప్రాధాన్యంపై సోమవారం నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 25న ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యం అనే అంశంపై మండల స్థాయిలో ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ డి.సుబ్రహ్మణ్యశాస్త్రి తెలిపారు. ఓటు హక్కు ఏ విధంగా పొందాలి, ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి అనే అంశంపై జరిగిన ఈ పోటీలకు పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారని నక్కపల్లి తెలుగు పండిట్ ఎన్.వి.ఎస్ ఆచార్యులు తెలిపారు. వ్యాసరచనతో పాటు, వక్తృత్వ పోటీలు కూడా నిర్వహించడం జరిగిందన్నారు. 25న ఓటర్ల దినోత్సవం నాడు విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీటీ తాతాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ పాప, హెచ్‌ఎం రాణి లలిత పాల్గొన్నారు.

ఘనంగా తీర్థ మహోత్సవం

కశింకోట : మండలంలోని జి.భీమవరం శివారు సింగవరం గ్రామంలో సోమవారం సాయంత్రం రామ తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వచ్చి స్థానికులతోపాటు ఉత్సాహంగా హాజరయ్యారు. స్థానిక రామాలయానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు వచ్చి, పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి తీర్థ మహోత్సవం సందడిగా సాగింది. పిల్లల ఆట వస్తువులు, తప్పెటగుళ్లు, నేల వేషాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేతాజీకి ఘన నివాళి



నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దాడి రత్నాకర్



కశింకోటలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్ : దేశనేతల ఆశయ సాధనకు యువత కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతిని పురస్కరించుకుని బోస్ విగ్రహానికి సోమవారం ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఖాళీ సమయాల్లో దేశ నాయకులు జీవిత చరిత్రలను చదవాలని సూచించారు. వీరి చరిత్ర అధ్యయనం యువత ఉన్నత శిఖరాలధిరోహించేందుకు బాటలు వేస్తుందన్నారు. కార్యక్రమంలో విగ్రహ దాత బొడ్డేడ శివాజీ, అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, జగన్నాథస్వామి ఆలయ చైర్మన్ దాడి ఈశ్వరరావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గంటి రవికుమార్, సభ్యులు చిరంజీవి, రాజు, ఇంద్రకుమార్, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోటలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు శిష్టి అప్పారావు, కార్యదర్శి వై.ఎ.రాజు, వివేకానంద విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు జనపరెడ్డి హరనాథ్, సత్యసాయి సమితి కన్వీనర్ ముక్కా అప్పలనాయుడు, ఆర్మీ విశ్రాంత ఉద్యోగి రోకళ్ల అప్పారావు, ఆర్మీ జవాన్లు, స్థానికులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం

అనకాపల్లిటౌన్ : రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలును పొడిగిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జీవో జారీ చేయడం శుభపరిణామమని జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మరో 10 సంవత్సరాలు పాటు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమల్లో ఉండటం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ పదేళ్లలో దళితవాడలు, గిరిజన ప్రాంతాలు మరింతగా అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

'నాడు-నేడు'తో విద్యాభివృద్ధి

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, నాడు–నేడు ద్వారా పాఠశాలలు అద్భుతంగా తయారవుతున్నాయని హెచ్‌ఎం పైల లచ్చాపాత్రుడు అన్నారు. రాజుపేట శివారు రామన్నపాలెంలోని ఎంపీపీ స్కూల్‌లో సోమవారం నాడు-నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తూ విద్యార్థులకు బంగారు భవితను అందిస్తున్నారన్నారు. ఈ పాఠశాలను రూ.33.42 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారని వచ్చే ఏడాదికి చిన్నారులకు అన్ని వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేతన్నలకు ప్రభుత్వం అండ

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు చిరంజీవి

అచ్యుతాపురం(అనకాపల్లి): చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకొంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి అన్నారు. అచ్యుతాపురం మండలంలోని దుప్పితూరు శ్రీ భద్రవతి చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం కార్యాలయాన్ని సందర్శించిన ఆయన చేనేత కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతన్న నేస్తం కింద రూ.24 వేల నగదుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తూ చేనేత రంగానికి దన్నుగా ఉంటున్నారని తెలిపారు. చేనేత కార్మికులకు అనేక నామినేటెడ్ పదవులు ఇస్తున్నారని తెలిపారు. అంతకు ముందు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నేతన్నలు నేస్తున్న నవారును గంజి చిరంజీవి పరిశీలించారు. చేనేత కార్మికులకు పెన్షన్ వచ్చే విధంగా ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మాడెం నూకరత్నం, సూరి అప్పారావు, పంచుమర్తి లక్ష్మీ భీమేశ్, జెడ్పీటీసీ లాలం రాంబాబు, ఎంపీపీ భర్త కోన బుజ్జి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, ఉమ్మడి విశాఖ జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు పప్పు రాజారావు, కొప్పల రామ్‌కుమార్, తేలు ఈశ్వరరావు, కులపాక అప్పారావు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ బాధితుల వివరాల నమోదు



వివరాలు నమోదులో రెవెన్యూ అధికారులు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట సచివాలయంలో సోమవారం పూడిమడక రోడ్డు విస్తరణ బాధితుల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరించారు. బాధితుల బ్యాంక్ ఖాతాలోకి నేరుగా నగదు జమయ్యేలా వీఆర్వో రమేష్ చర్యలు చేపట్టారు. బాధితుల బ్యాంకు ఖాతా నంబర్లు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, బాధిత రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలకు చెక్

- డ్రైనేజీ సమస్య పరిష్కారానికి సీఎంకు నివేదిక
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి గుడివాడ



తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యను దశల వారీగా పరిష్కరిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యపై అధికారులను నివేదిక కోరినట్టు తెలిపారు. వారం రోజుల్లో నివేదికను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి, నిధుల మంజూరుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. మండలంలోని అక్కిరెడ్డిపాలెం పంచాయతీ, మెట్టమీద కాలనీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మంత్రి అమర్‌నాథ్ ఇంటింటికీ వెళ్లికి ప్రజలు సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కో కుటుంబానికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో.. ఆధారాలతో సహా వివరించారు. ప్రభుత్వ పథకాలపై రూపొందించిన బ్రోచర్లను ప్రజలకు అందించారు. స్థానికంగా ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. వారిచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రజాహితం కోసం పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల్లో ఉన్న సమస్యలతో పాటు, ప్రభుత్వపరంగా వ్యక్తిగత సమస్యలను కూడా పరిష్కరించాలనే ఉద్దేశంతోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్య స్థాయి ఆధారంగా వీలైనంత వేగంగా వాటి పరిష్కారానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి, మరోసారి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాలని కోరారు. అంతకుముందు కాలనీలో రూ.10.30 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంక్‌ను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, తహసీల్దార్ గంగాధరావు, ఎంఈవో డి.దివాకర్, వెలుగు ఏపీఎం కె.నీలాచలం, పంచాయతీ రాజ్ ఈఈ వేణుగోపాలరావు, అక్కిరెడ్డిపాలెం సచివాలయ కన్వీనర్లు నారపిన్ని ప్రసాద్, మామిడి ధనలక్ష్మి, శీరంశెట్టి అప్పలరాజు, సాలాపు అప్పలనాయుడు, పార్టీ నేతలు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే గృహం మంజూరు చేయాలని ఆదేశం

కాలనీకి చెందిన సాలాపు పెంటయ్యకు వివాహం జరిగింది. తల్లిదండ్రుల నుంచి విడిపోయి భార్యాబిడ్డలతో గ్రామంలోని మోదకొండమ్మగుడి సమీపంలో జీవనం సాగిస్తున్నాడు. గతంలో ప్రభుత్వం మూడు సెంట్ల స్థలం ఇచ్చింది. స్థానిక పెద్దలంతా కలిసి పెంటయ్య స్థలానికి పక్కనే ప్రభుత్వం కల్యాణమండపం నిర్మిస్తుండటంతో పెద్దల సమక్షంలో పెంటయ్య స్థలాన్ని ప్రభుత్వానికి అందజేశారు. అప్పటి నుంచి అద్దె గృహంలో పెంటయ్య కుటుంబం జీవిస్తోంది. ఎన్ని సార్లు ప్రభుత్వ అధికారులకు మొరపెట్టుకున్నా.. ఫలితంలేకుండా పోయింది. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో జగనన్న కాలనీలో తక్షణమే ఆయనకు గృహం మంజూరు చేయాలని తహసీల్దార్ గంగాధర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లిటౌన్ : జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ స్థానిక ఈఈ ఎస్.రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని న్యూ కాలనీ, ఎన్టీఆర్ క్రీడా మైదానం, శారదా కాలనీ, ఎమ్మార్వో కార్యాలయం, నాలుగు రోడ్ల కూడలి, పూడిమడక రహదారి, వేల్పులవీధి, గాంధీనగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ అసౌకర్యానికి ఆయా ప్రాంతాల ప్రజలు ముందుగానే తమ కార్యకలాపాలు పూర్తి చేసుకుని తమకు సహకరించాలని కోరారు.